ప్రజాశక్తి

ఆదివారం 17 డిసెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి

రాప్తాడు నియోజకవర్గం ఆకుతోటపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సచివాలయ అధికారులు బలవంతంగా తలుపులు తెరిచి కొద్ది సేపటికి ఇలా మూసి వేశారు..!!

పోరు ముంగిట తగ్గని

అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల పోరు తీవ్రం అయ్యింది. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మొక్కవోని పోరాట స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిర్బంధాలను విధించినా, బెదిరింపులకు దిగినా వెరవకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. శనివారం నాటికి సమ్మె 5వ రోజుకు చేరుకుంది. అన్ని మండలాల్లోనూ అంగన్‌వాడీలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. వీరికి పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు తెలుపుతున్నాయి.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె
- పెరుగుతున్న చిన్నారుల తల్లిదండ్రుల మద్దతు
- అంగన్‌వాడీలు వస్తేనే సెంటర్‌కు వెళ్తామంటున్న గర్భిణులు, బాలింతలు
- సచివాలయ సిబ్బంది సెంటర్లు తెరిచినా పిల్లల్ని పంపని వైనం
- తాళాలు పగులగొట్టడాన్ని అడ్డుకుంటున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం, గుత్తి, చిలమత్తూరు

అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టే కార్యక్రమాన్ని అధికారులు శనివారం నాడు కూడా కొనసాగించారు. ఈ చర్యలను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల బలవంతంగా కేంద్రాలను స్వాధీనం చేసుకన్నారు. అయితే ఆ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఎవరూ పిల్లలను కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడం లేదు. అంగన్‌వాడీ సిబ్బంది లేనిదే తమ పిల్లలను పంపమంటూ తల్లిదండ్రులు తెగేసి చెబుతున్నారు. గర్భిణులు, బాలింతలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన హామీని ఇచ్చేంత వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మెకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ముఖ్యమంత్రి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని తల్లిదండ్రులు స్వచ్ఛందగా సమ్మెకు మద్దతను ఇస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు వెళ్లిన సచివాలయ సిబ్బందిని వారించి అక్కడి నుంచి వెనక్కు పంపివేస్తున్నారు. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచిన చోటు కూడా నామమాత్రంగానే కేంద్రం నిర్వహణ జరుగుతోంది. పిల్లలు ఎవరూ రాకపోవడంతో కేంద్రానికి తాళాలు వేసి సచివాలయ సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

హిందూపురంలో అంగన్‌వాడీల సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

అంగన్‌వాడీల ఆగ్రహం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటి కోసం పోరాడుతున్న వారిపై బెదిరింపులకు దిగుతుండడంపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉండగా జగన్మోహన్‌రెడ్డి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తానంటూ హామీలు గుప్పించి గద్దెనెక్కాక వాటిని అమలు చేయకుండా మోసగించారంటూ అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు వేయించుకున్న అనంతరం ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం అణచివేత ధోరణిని మానుకుని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, లేకుంటే సమ్మె మరింత ఉధృతం అవుతుందని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న తల్లిదండ్రుల మద్దతు

అంగన్‌వాడీలకు ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రుల మద్దతు పెరుగుతోంది. సమ్మె న్యాయమైనదే అంటూ సంఘీభావం తెలుపుతున్నారు. అధికారులు బలవంతంగా సచివాలయాల తలుపులను తెరుస్తున్నా పిల్లల్ని పంపడానికి తల్లిదండ్రులు సుముఖత చూపడం లేదు. అంగన్‌వాడీ టీచర్లు లేని కేంద్రాలకు తమ పిల్లల్ని పంపేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. పిల్లల్ని కేంద్రానికి పంపితే అక్కడ వారిని జాగ్రత్తగా చూసుకునే వారు లేకపోతే ఎలా పంపాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ఉంటారని చెబుతున్నా వారిపై తమకు నమ్మకం లేదని తల్లిదండ్రులు కుండబద్దలు కొట్ట చెబుతున్నారు.

సమ్మె సందర్భంగా కదిరిలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తలుపులు తెరవడానికే పరిమితం

అధికారులు సచివాలయాల తలుపులు తెరవడానికే పరిమితం అవుతున్నారు. కనీసం కేంద్రాన్ని ఉదయం శుభ్రం చేయడం లేదు. దుమ్మూధూళిలోనే చిన్న పిల్లల్ని కూర్చే బెట్టె ప్రయత్నం చేస్తున్నారు. తాగునీటిని కూడా ఉంచడం లేదు. బలవంతంగా పిల్లల్ని సచివాలయ సిబ్బంది తీసుకెళ్తున్నా కేంద్రంలో ఈ పరిస్థితిని చూసిన తల్లిదండ్రులు పిల్లల్ని వెనక్కు తీసుకెళ్లి పోతున్నారు. గర్భిణులు, బాలింతలు కూడా పౌష్టికాహారం తీసుకునేందుకు వెళ్లడంలేదు. అంగన్‌వాడీ సిబ్బంది వచ్చిన తరువాతనే వాటిని తీసుకుంటామని చెబుతున్నారు.

తెరిచిన కొద్దిసేపటికే మూసి వేసిన చిలమత్తూరు అంగన్‌వాడీ కేంద్రం

తాళం తీస్తారు.. వెళ్లిపోతారు..

సచివాలయం వాళ్లు అంగన్‌వాడీ సెంటరు తాళాలు తీస్తారు... కొద్దిసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోతారు. కేంద్రం తాళాలు తెరిచినట్లు సచివాలయ సిబ్బంది ఫొటోలు తీసుకోవడం కొద్దిసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోవడం జరుగుతోంది. మూడు రోజులుగా తమ కాలనీలోని కేంద్రంలో ఇదే పరిస్థితి ఉంది. తన మనవడుకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాన్ని పిలుచుకెళ్లి అన్నం పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

చిన్నఅక్కమ్మ, వృద్ధురాలు.గుత్తి.

భద్రతలేదని పిల్లల్ని పంపలేదు..

నా కొడుకు పి.మహ్మద్‌మాజ్‌కు 4 సంవత్సరాలు. చిలమత్తూరు అంగన్‌వాడీ కేంద్రానికి పంపుతున్నాం. ప్రస్తుతం అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కేంద్రంలో ఉన్నప్పుడు పిల్లల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకునే వారు. ఇప్పుడు ఎవరెవరూ అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటున్నారు. వారిని నమ్మి పిల్లల్ని ఎలా పంపాలి. పిల్లల అక్కడ రక్షణ ఉండడం లేదు. అందుకే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వచ్చేంత వరకు నా కుమారున్ని కేంద్రానికి పంపను.

నవీన్‌తాజ్, చిలమత్తూరు

ఇప్పుడున్న వారిపై నమ్మకం లేదు..

నా కూతురు అంగన్‌వాడీ ప్రీస్కూల్‌కు వెళ్తుండేది. ఇప్పుడు సచివాలయ సిబ్బంది వచ్చి అంగన్‌వాడీ కేంద్రం తెరిచాం పిల్లల్ని పంపాలని చెబుతున్నారు. అక్కడికెళ్తే ఎవరూ ఉండడం లేదు. దీంతో నాకూతుర్ని ప్రీస్కూల్‌కి పంపలేదు. తాత్కాలికంగా వచ్చే వారిపై నమ్మకం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె న్యాయమైనదే. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలి. లేకుంటే పిల్లలు అంగన్‌వాడీలకు దూరం అయ్యే ప్రమాదం ఉంది.

అశ్విని, చిలమత్తూరు

పాలు,గుడ్లు ఇవ్వడం లేదు

అంగన్వాడీ కేంద్రంలో పాలు, గుడ్లు ఇవ్వడం లేదు. అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నప్పుడు పిలిచి మరీ ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రం తాళాలు అయితే తీస్తున్నారు తప్పా పాలు, గుడ్లు గురించి పట్టించుకోవడం లేదు. ఏదైనా అడిగితే తమకేమి సంబంధం లదేని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల ద్వారా పౌష్టికాహారం అందజేయాలి.

సువర్ణ, గర్భవతి.దాసరి కాలనీ, గుత్తి.

అంగన్వాడీలు బాగా చూసుకునేవారు..

అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మమ్మల్ని బాగా చూసుకునేవారు. పాలు, గుడ్లు, రాగి పిండి పాకెట్లుతో కూడిన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇచ్చేవారు. కేంద్రంకు వెళ్లలేని పరిస్థితి ఉంటే ఇంటి వద్దకొచ్చి ఇచ్చేవారు. నాలుగు రోజులుగా అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఇవ్వడం లేదు. దీని గురించి అక్కడున్న సచివాలయ సిబ్బందిని అడిగితే పట్టించుకోవడం లేదు. ఐదు రోజులుగా సచివాలయ సిబ్బంది ఎవరికీ పౌష్టికాహారం ఇవ్వడం లేదు.

సరళ, బాలింత,గుత్తి.

ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

జైలు నుంచి బయటకు వెళ్లిన అనంతరం తమ ప్రవర్తనలో మార్పు వచ్చేలా మెలగాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి ఖైదీలకు సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు.. ఎప్పటినుంచి జైల్లో ఉన్నారు.. నేరాల నేపథ్యం తదితర కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు గదులు ఆవరణాన్ని పరిశీలన చేశారు. అక్కడ సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరలను న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు రావడం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. జైలు నుంచి బయటికి వెళ్లిన తర్వాత మంచి మార్పుతో ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కృష్ణమూర్తి, జైలు అధికారి అంజి నాయక్, లోక్ అదాలత్ హేమావతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

.జైలు గదులను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

కోర్టుల నిర్వహణకు భవనాల పరిశీలన

ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న కోర్టుల స్థానంలో నూతన కోర్టులో భవనాలు నిర్మించే వరకు తాత్కాలికంగా కోర్టు నిర్వహించేందుకు అవసరమైన భవనాలను శనివారం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పరిశీలించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని న్యాయమూర్తులు పరిశీలించారు. భవన సముదాయానికి సంబంధించి గుత్తేదారుకు బిల్లులు చెల్లించాల్సి ఉండడంతో ఇప్పటివరకు ఆ భవనాన్ని స్వాధీనం చేయలేదు. దీంతో పాత బిపిఎల్ షోరూం భవన సముదాయాన్ని కూడా తాత్కాలికంగా కోర్టు నిర్వహణకు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, ఎజిపి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు

పెనుకొండ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జి అకాల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అనియుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం సాబ్జి మృతికి సంతాప సభ నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ సాబ్జి ఉద్యమ స్ఫూర్తితో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరుడాతా మన్నారు. ఆయన ఆశయ సాధన, సంఘాన్ని బలోపేతం చేయడం మన ముందున్న కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో పెనుకొండ డివిజన్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు నారాయణస్వామి, కృష్ణానాయక్, ఎంకె.నబి, రవీంద్రనాథ్, ఉపేంద్ర, రామాంజనేయులు, ఓబిలేసు, ఆదిజినేష్, గంగాధర్, శేషాద్రి, వెంకటేశులు, సుబ్బరాయుడు, దాదు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మతి భాదకరమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం నాడు పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సాబ్జీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కషిచేశారని జయచంద్రారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హరికృష్ణ, సాయిగణేశ్, ఆంజనేయులు, జనార్దన్ బాబు, బాలగొండ్ల శివయ్య, వినయ్‌మార్, అమర్నాథరెడ్డి, నాగేంద్రకుమార్, గోపాల్‌రెడ్డి, ఆదిశేషు, నాగేశ్వరరెడ్డి, వెంకటకష్ణకిశోర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : పల్లె

ప్రజాశక్తి-నల్లమాడ

రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం నల్లమాడలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ అమలు చేసి అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడిందన్నారు. పరిశ్రమలు గానీ, సాగునీటి ప్రాజెక్టులు గానీ ఒక్కటంటే ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేని అసమర్థ ప్రభుత్వం అన్నారు. పోలవరంను అర్థాంతరంగా నిలిపేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.ఇలాంటి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

నేడు చేనేతల రౌండ్‌టేబుల్ సమావేశం

విలేకరులతో మాట్లాడుతున్న గిర్రాజు రవి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చట్టసభల్లో చేనేతల ఉనికిని చాటేందుకు ధర్మవరం పట్టణంలో ఆదివారం నాడు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ధర్మవరం పట్టు చీరల తయారీ సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి, గౌరవాధ్యక్షులు పోలా వెంకటనారాయణ తెలిపారు. శనివారం పట్టణంలోని సెమీ నారాయణ స్వామి దేవాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని వాసవి గుడి ఎదురుగా ఉన్న అర్జున్ ఫ్యాబ్రిక్స్ రిటైల్ వ్యాపార సంస్థలను కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దంపతులచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని ప్రణవ్ ఫంక్షన్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి జాతీయ చేనేత అధ్యక్షులు అనంత ప్రసాద్, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, మాజీ ఆప్కో ఛైర్మన్ చిరంజీవి, మాజీ ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరువుతారన్నారు. చేనేత పరిశ్రమను కాపాడుకునేందుకు పాటించాల్సిన విధివిధానాలు, రాజకీయ ప్రాధాన్యతపై రౌండ్‌టేబుల్ సమావేశంలో చర్చిస్తామన్నారు. చేనేత పరిశ్రమను కాపాడుకునేందుకు భవిష్యత్తు ప్రణాళికతో పాటు, పోరాటాలు కూడా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి చేనేత కార్మిక సంఘం నాయకులు, వ్యాపారస్తులు, చేనేతలు పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ గడ్డం పార్థసారథి, గిర్రాజు నగేష్, కార్యదర్శి హేమంత్ కుమార్, సుందరేసన్ పాల్గొన్నారు.

'అరాచకానికే అడ్డుపడుతున్నాం'

కేతిరెడ్డిపై పరిటాలశ్రీరామ్ ఆగ్రహం

విలేకరులతో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గంలో జరుగుతున్న ఏ అభివృద్ధికీ టీడీపీ అడ్డుపడలేదని, కేవలం ఎమ్మెల్యే కేతిరెడ్డి చేస్తున్న అరాచకానికి మాత్రమే అడ్డుపడుతున్నామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కేతిరెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని చెప్పేందుకు జిల్లేడుబండ ప్రాజెక్టు ఒక్కటిచాలన్నారు. 4 గ్రామాలను 1700 ఎకరాలను ముంచేస్తూ ప్రాజెక్టును కడుతుంటే కనీసం నిర్వాసితులతో మాట్లాడాల్సిన అవసరం లేదాని ప్రశ్నించారు. బాధితులకు పరిహారం ఇవ్వకుండా హడావుడిగా ఎందుకు పనులు చేస్తున్నారని నిలదీశారు. ఆదానీపవర్ ప్లాంటుకోసం రోడ్డు నిర్మించాలని తాడిమర్రిలో ఏళ్ల తరబడి ఉన్న ఇళ్లను నిర్దాక్షిణంగా కూల్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కదిరిగేటు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి విషయంలో కూడా అలానే వ్యవహరించారన్నారు. ఇలాంటి వాటిపై ప్రజల పక్షనా టిడిపి నిలిచిపోరాటం చేస్తోందన్నారు. ధర్మవరంలో మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా కబరస్తాన్ను కూల్చివేస్తే తాము ప్రశ్నించామన్నారు. టీడీపీ గురించి మాట్లాడే స్థాయి కేతిరెడ్డికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, నాగూర్ హుస్సేన్, పరిశేసుధాకర్, అంబటిసనత్, కేశగాళ్లశీన, బీబీ, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పలువురికి పల్లె పరామర్శ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం నాడు పల్లె రఘునాథ్ రెడ్డి పలు కుటుంబాలను పరామర్శించారు. మండల పరిధిలో సుబ్బరాయనపల్లి గ్రామంలో మరణించిన అలివేలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుగ్గపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన నర్సింహులు ఇటీవల అనారోగ్య కారణంగా మరణించడంతో వారి కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

ఎస్పీకి అవార్డును అందిస్తున్న డిజిపి

ఎస్పీ మాధవరెడ్డికి అవార్డు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో డిస్క్ కమెండేషన్ అవార్డు దక్కింది. శనివారం నాడు విజయవాడలోని మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రాష్ట్ర డిజిపి కె.వి రాజేంద్రనాథ్ రెడ్డి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, 'దిశ', శాంతిభద్రతల విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరచిన ఐపిఎస్ అధికారులకు ప్రతి ఏటా కమెండేషన్ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఎస్పీ అవార్డును అందుకున్నారు.

'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ'

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.పవన్ కళ్యాణ్, ఓబులేసు, కేశవ, రామంజి, సత్తి, నాగ, రవి, నాగరాజు, రమణ, శ్యామల పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

'హామీలను అమలు చేయాలనే కోరుతున్నాం'...

అంగన్వాడీల సమ్మెను ప్రజా పోరాటం చేస్తాం సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ధర్మవరం : భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

నల్లచెరువు : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమ్మెపై మొండి వైఖరి మానుకొని, తక్షణమే సమస్యలను పరిష్కారించాలని, లేని పక్షంలో ప్రజా పోరాటాం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ స్పష్టం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీలు శనివారం పట్టణంలో ఎర్ర చీరలు ధరించి నిరసన తెలిపారు. అంతకుముందు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు, వివిధ కార్మిక సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం అంగన్వాడీలు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ నాయకులు, ప్రజలు, పాత్రికేయులకు రాఖీలు కట్టి సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇంతియాజ్ మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిచో వచ్చే ఎన్నికల్లో అంగన్వాడీల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు నాగరాజు, అత్తార్ బాబా, యూనియన్ నాయకురాళ్లు లావణ్య, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన సిఎం జగన్ : సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

సోమందేపల్లి : పాదయాత్రలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా సిఎం జగన్ మాట తప్పారని, అందువల్లే వారు న్యాయమైన డిమాండ్ల సాధనకై రోడ్డెక్కారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దర్ కార్యాలయంలో అంగన్వాడీ కార్మికులు చేస్తున్న ధర్నాలో వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్నతో కలిసి పాల్గొన్నారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్స్ పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బెస్త క్రిష్టప్ప, కుమ్మరి కిష్టప్ప, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని..

మడకశిర : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. వీరికి ఎస్టీయు నాయకులు మద్దతు తెలిపారు. ఎస్టీయు జిల్లా ఉపాధ్యక్షులు టి.ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. దీక్షలో రామాంజనేయులు, తిప్పేస్వామి, ఉషారాణి, పద్మ, సిపిఐ, గంగాధర్, నాగరాజు, రమేష్, రవి, శంకర, మంజు, తనూజ్ పాల్గొన్నారు.

చెవిలో పువ్వులతో మోకాళ్లపై నిల్చొని..

నల్లచెరువు : సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు చెవిలో పువ్వులతో మోకాళ్లపై నిల్చొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమించేది లేదని, మరింత ఉధతం చేస్తామని సిఐటియు మండల అధ్యక్షుడు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, వ్య.కా.సం నాయకులు రమేష్ తెలిపారు.

సోమేందేపల్లి : శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

లేపాక్షి : లేపాక్షిలో అంగన్వాడీ సిబ్బంది కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. వారికి టిడిపి నాయకులు కంచిసముద్రం సదాశివారెడ్డి మద్దతు తెలిపి మధ్యాహ్నం భోజనం అందించారు.దీక్షలో ధనమ్మ, రాజప్ప, సంపూర్ణ మ్మ, తదితరులు పాల్గొన్నారు.

మూతికి నల్ల రిబ్బన్‌తో నిరసన

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీలు మూతికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, ఆశా వర్కర్స్ మద్దతు తెలిపారు. దీక్షలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, రాజురావు, అంగ న్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బావమ్మ, జయమ్మ, సావిత్రమ్మ, మాబున్నీసా, వరలక్ష్మి, పార్వ తమ్మ, ఆవా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, తులసి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీ సిబ్బంది నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు వాసంతి, ప్రధాన కార్యదర్శి రజియా, వసంత, రజిత, పుష్పలత, శివమ్మ, శ్రీదేవి, ఆదెమ్మ, సుగుణ, క్రిష్టవేణి, జయసుధ, సున్నీబేగం, మంజుల, వర్కర్లు ,హెల్పర్లు పాల్గొన్నారు.

తలుపుల : యూనియన్ అధ్యక్షురాలు సుశీల ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు మూతికి నల్ల రిబ్బన్ ధరించి వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బలవంతంగా తెరిచినా హాజరుకాని విద్యార్థులు

కొత్తచెరువు : అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో ఉండడంతో మండల వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ సిబ్బంది కేంద్రాలను తెరిచినా ప్రయోజనం లేకపోయింది. విద్యార్థులు ఎవరూ హాజరు కాలేదు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీలు సమ్మెల ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాల య సిబ్బంది మండలంలోని అల్లాపల్లి, ఎ.ఎర్రపల్లి, చౌడంపల్లి, మద్దకవారిపల్లి, తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను పగులగొట్టి తలుపులు తెరిచారు. వారిలో మహిళా పోలీస్ ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త అశ్విని, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బెదిరింపులు సిగ్గుచేటు

కదిరి అర్బన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్షకు ముస్లిం మైనార్టీ మత పెద్దలు సంపూర్ణ మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు నరసింహులు, జగన్మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్‌జాన్ మాట్లాడుతూ సమ్మెలో ఉన్న అంగన్వాడీలపై బెదిరింపులకు పాల్పడ టం సిగ్గుచేటన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వెళ్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్ సునీతకు వినతి పత్రం అందజేశారు. దీక్షలో అంగన్వాడీ వర్కర్స్ జిల్లా యూని యన్ అధ్యక్షురాలు మాబున్నీసా, సెక్టార్ లీడర్ శారద, లక్ష్మీ, చంద్రకళ, సుశీల, సుజాత, రామలక్ష్మి, లక్ష్మీ, సువర్ణ, సరోజ, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి వస్తే న్యాయం చేస్తాం

గుడిబండ : అంగన్వాడీల నిరవధిక సమ్మెకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు మద్దతు తెలిపారు. గుండుమల మాట్లాడుతూ టిడిపి అధికా రంలోకి రాగానే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీక్షలో టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు శివకుమార్, దుర్గేష్, మంజునాథ్, కృష్ణమూర్తి, జనార్ధన్, నాగరాజు, రవిస్వామి, రాజేంద్ర, పురుషోత్తం, క్రిష్టప్ప, జయరామప్ప, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ, లక్ష్మీదేవి, నాగవేణి, సుజాత, దేవీరమ్మ, నాగరత్న, దాక్షాయణి, శాంతమ్మ, లక్ష్మీదేవి, రాధిక, శ్యామల, రమాదేవి, లక్కమ్మ, హనుమక్క, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జికి నివాళి

నల్లచెరువు : అంగన్వాడీల దీక్షా శిబిరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు నాయకులు సాంబశివ మాట్లాడుతూ సాబ్జి ఉపాధ్యాయ సమస్యల పట్ల నిత్యం తన గళాన్ని సభలో వినిపించి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేశారని, ఆయన మతి ఉపాధ్యాయ సంఘాలకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం శ్రీరాములు, వ్య.కా.సం నాయకులు రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంగన్వాడీల సమ్మె ఐదోరోజూ కొనసాగింది. వీరికి చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు మద్దతు పలికారు.

పుట్టపర్తి రూరల్ : అంగన్వాడీలు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ముందు శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. తొలుత గణేష్ కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సిఐటియు నాయకులు అంజి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బ్యాల్ల అంజి, ప్రాజెక్టు జిల్లా ప్రధాన కార్యదర్శి మణెమ్మ, సెక్టార్ సభ్యురాలు షర్మిల, నాయకురాళ్లు జయమ్మ, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి, మండలాల అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ నిరసన

ధర్మవరం టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం చేపట్టిన దీక్షను కొనసాగించారు. అలాగే సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు పట్టణంలోని ప్రధానకూడళ్లలో భిక్షాటన చేపట్టారు. వారి దీక్షకు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకులు అయూబ్ ఖాన్, ఆదినారాయణ మద్దతు తెలిపారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన దీక్షకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి స్థానిక నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. దీక్షలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, నరసింహమూర్తి, యూనియన్ అధ్యక్షురాలు నాగమణి, అనసూయ, సెక్టార్ లీడర్లు మంజుల, చంద్రకళ, సరస్వతి, సిఐటియు మండల అధ్యక్షుడు మబూఖాన్, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పూలతో..

ముదిగుబ్బ : అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకొని, ముఖానికి నల్లని వస్త్రం కట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షకు సిఐటియు, సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న, బండల వెంకటేష్, పోతలయ్య, సిపిఐ, కాంగ్రెస్‌పార్టీల నాయకులు మద్దతు పలికారు.

హిందూపురం : ప్రజలకు రాఖీ కట్టి మద్దతు కోరుతున్న అంగన్వాడీలు

తలుపుల : మూతికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన

గుడిబండ : అంగన్వాడీల దీక్షకు మద్దతు తెలుపుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర : అంగన్వాడీల దీక్షకు మద్దతు తెలుపుతున్న ఎస్టీయు నాయకులు

యువగళం జనగళంగా మారింది : బికె

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జనగళంగా మారిందని పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శని వారం ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. సభలు, సమావేశాలకు ప్రజలు స్వచ్ఛంధంగా తరలివచ్చి మద్దతు పలకడంతో పాటు వారి సమస్యలను మొరపెట్టుకు న్నారన్నారు. నిరాశ, నిస్పృహలతో ఉన్న ఆంధ్ర ప్రజలకు లోకేష్ ఆశాకిరణంలా కనిపిస్తున్నారన్నారు. యువగళం పాదయాత్ర ముగింపు సభ విజయనగరం జిల్లాలో డిసెంబర్ 20వ తేదీ ఉంటుందని, అందులో జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎం.రాయపురం బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ పరిధిలోని మారుమూల ప్రాంతమైన ఎం.రాయపురం గ్రామానికి రాత్రి వేళ రద్దు చేసిన బస్సును వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు శ్రీనివాసులు, సోమన్న, రంగనాథ్, తదితరులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా హిందూపురం నుంచి రాత్రి వేళ మడకశిర, గుడిబండ, రొళ్ల మీదుగా ఎం.రాయపురం గ్రామానికి బస్సు సర్వీసు ఉండేదని, ఆ బస్సు 50 గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉండేదన్నారు. ఆర్టీసీ అధికారులు ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు రోజుల్లో ఆ బస్సును పునరుద్ధరించకపోతే డిపో కార్యాలయం ముందు ధర్నా చేసి బస్సులను అడ్డుకుంటామని హెచ్చరించారు.



ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సాగుదారులకే భూములివ్వాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కొన్నేళ్లుగా సాగులో ఉన్న వారికి కాకుండా భూస్వాములకు భూపంపిణీ చేయడం తగదని, సాగులో ఉన్న వారికే భూములు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం రెవెన్యూ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని రేగాటిపల్లి సొసైటీ భూములను 20 ఏళ్లుగా సాగు చేసు కుంటున్న రైతులకు కాకుండా డబ్బున్న వారికి, బడా బాబులకు పంపిణీ చేయడం దుర్మార్గమన్నారు. అందులోనూ గ్రామంలో ఒకే వర్గానికి చెందిన వారికే అధికంగా భూపట్టాలు అందజేయడం ఏంటని ప్రశ్నించారు. వినతి ఇచ్చిన వారిలో గోనుగుంట్ల అనుచరులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, చిలకం సూర్యనారాయణరెడ్డి, దుస్సా క్రిష్ణ, నారాయణస్వామియాదవ్, నబిరసూల్, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, అశ్వర్థనాయుడు, ఒంటికొండ రాము, గంధమనేని నారాయణస్వామి ఉన్నారు.

రెవెన్యూ కార్యాలయఅధికారికి వినతిపత్రం అందజేస్తున్న గోనుగుంట్ల అనుచరులు

18న ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

పుట్టపర్తి రూరల్ : ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్ల సాధనకై ఈ నెల 18వ తేదీ చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సంఘం ప్రతినిధులతో కలిసి ప్రశాంతిగ్రామ్‌లోని డిడబ్ల్యుఎంఎ కార్యాలయంలో పిడి విజయేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ నెల 18న కలెక్టరేట్ల ముట్టడి, జనవరి 5న చలో విజయవాడ కార్యక్రమాలు చేపడుతున్నామని విజయవంతం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు బి.నర్సింహులు, హేమాద్రి, సురేష్‌బాబు, రామకృష్ణ, వెంకటేష్ ఉన్నారు.

జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు మనోజ్

ధర్మవరం టౌన్ : ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్-మనోజ్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం శైలజ, పిడి నాగేంద్ర తెలిపారు. మనోజ్‌కు ఉపాధ్యాయుడు శేషు రూ. 3వేల విలువచేసే ఫైబర్ బాల్ బాడ్మింటన్ బ్యాట్స్, రూ. 1800 విలువచేసే బాల్స్ రిటైర్డ్ టీచర్ జయసింహ ద్వారా అందజేశారు. మనోజ్‌ను హెచ్ఎం, పిడితో పాటు ఉపాధ్యాయులు వేణుగోపాల్, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఎంపి విజయసాయిరెడ్డిని కలిసిన జడ్పిటిసి జయరాం

గిరిజనులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి-గోరంట్ల

గోరంట్ల జడ్పిటిసి, వైసిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాలే జయరామ్ నాయక్ శనివారం విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎంపి విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జయరామ్ ఉమ్మడి అనంతపురం జిల్లా సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గిరిజనులకు పెనుకొండ, పుట్టపర్తి, కదిరి ఏదో ఒక ఎమ్మెల్యే సీటును కేటాయించాలని కోరారు. జడ్పిటిసిలకు ప్రొటోకాల్ ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో గిరిజన భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనతో పాటు సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్ ఉన్నారు.

23న వైసిపి లీగల్ సెల్ సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ

అనంతపురం నగరంలో ఈ నెల 23వ తేదీ నిర్వహించే ఉమ్మడి జిల్లా వైసిపి లీగల్ సెల్ సమన్వయ కమిటీ సమావేశానికి న్యాయవాదుల ందరూ హాజరై విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బార్ రూమ్‌లో శనివారం జోనల్ ఇన్‌ఛార్జి లోకేశ్వర్‌రెడ్డి, రెండు జిల్లాల అధ్యక్షులు ఉమాపతి, ప్రసాద్‌రెడ్డి, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివశర్మ, మోహన్‌నాయక్, శ్రీనివాసులు, విక్రాంత్ నాయక్, అశ్వర్థనారాయణ, నాగిరెడ్డి, బాలాజీ, జావిద్, నాగార్జున, గొల్ల లక్ష్మీనారాయణ, హరి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు రంధ్రం.. నీరు వృథా..

ముదిగుబ్బ : స్థానిక దొరిగల్లు రోడ్డు పక్కన పైపులైన్‌లో రంధ్రం పడి పెద్దఎత్తున నీరు వృథా అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్‌కు రధ్రం పడి వృథా అవుతున్న నీరు

నిరసన హోరు..!

ప్రజాశక్తి-అనంతపురం

అంగన్‌వాడీల సమ్మె, ఆశాల 36 గంటల నిరసనలతో ఉమ్మడి అనంతపురం జిల్లా ఈ వారం అట్టుడికింది. ఎన్నికల హామీల అమలు, సమస్య పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళనబాట పట్టారు. ముఖ్యంగా అంగన్‌వాడీలు దర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సమ్మెలోకి వెళ్లారు. సిఎం జగన్ తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తానని, ఇతర ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సంఘటిత పోరాటం ప్రారం భించారు. వీరి న్యాయమైన ఆందోళనకు పలు పార్టీలు, ప్రజాసంఘాల, ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ నెల 12వ తేదీన ప్రారంభం అయిన సమ్మె పోరాట స్ఫూర్తితో కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి, అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు దీక్షా శిబిరాలను ఏర్పాటు చేసుకుని ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు ఆందోళన ఆపేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. ఇక ఆశా కార్యకర్తలు కూడా ఆందోళన బాట పట్టారు. 36 గంటల నిరసన దీక్షల పేరుతో గురు, శుక్రవారాలు అనంత పురం కలెక్టరేట్, పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద వంటా-వార్పుతో నిరసన తెలిపారు. కనీస వేతనం ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, రాజకీయ వేధిం పులు ఆపాలనే తదితర డిమాండ్లతో వీరు నిరసన దీక్ష చేపట్టారు. చలిని సైతం లెక్క చేయకుండా ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు గురువారం రాత్రి దీక్షా శిబిరంలోనే నిద్రించారు. వీరికి పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు తెలిపాయి.

నిరసనలు అణిచివేసే కుట్ర

అంగన్‌వాడీ, ఆశాల న్యాయమైన సమ స్యలను పరిష్కరించే దిశగా ఆలోచన చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సమ్మె, నిరసనలను విచ్ఛిన్నం చేసే కుట్రలకు తెరలేపింది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాల ను బలవంతంగా బద్దలు కొట్టి తలుపులు తీయడం, ఆందోళనల్లో పాల్గొంటున్న అంగన్‌వాడీలను బెదిరించడం లాంటి చర్యలకు పాల్పడింది. ఆశాలను సైతం ఆందోళనల్లో పాల్గొనకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వస్తున్న వారిని కాపుకాచి మరీ కిందకు దింపి పోలీసు స్టేషన్‌లకు తరలించారు. పోలీసులు ఎన్ని నిర్బంధాలను ప్రయోగించినా అంగన్‌వాడీలు, ఆశాలు వారి పోరాటాలను విజయ వంతం చేశారు. సమస్యలను పరష్కరించమంటే ఆందోళనలపై ఇలా నిర్బంధాలు, దాడులు చేయించడం దుర్మార్గమైన చర్యని సిపిఎం, సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు బెదిరేది లేదని అంగన్‌వాడీలు, ఆశల సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

కేంద్ర కరువు బృందం పర్యటన

ఉమ్మడి జిల్లాలో ఈ వారం కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈనెల 12న అనంతపురం జిల్లాలో, 13న సత్యసాయి జిల్లాలో బృందం పర్యటించి తొలి రోజు అనంతపురం కలెక్టరేట్లో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కరువు పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మూడు బృందాల్లో పలు మండలాల్లో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 13వ తేదీ సైతం సత్యసాయి జిల్లాలోనూ పంటలను పరిశీలిం చారు. అయితే కేంద్ర కరువు బృందం పర్యటనపై నామమాత్రంగానే జరిగిందనే విమర్శలు రైతుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తొలి రోజు సాయం త్రం 4 గంటలు పైనా పొలాలకు వెళ్లారు. వీరు వెళ్లే సమయానికి రైతులెవరూ పొలాల్లో లేకపోవడంతో కరువు పరిస్థితులను ఎవరూ తెలపలేకపోయారు. అక్కడున్న వ్యవసాయ అధికారులే పంటల పరిస్థితిని వివరించారు. 2వ రోజు కూడా హడావుడి గానే పర్యటనను ముగించుకుని కరువు బృందం సభ్యులు వెనుదిరిగారు. మొత్తంగా అనంతపురం జిల్లాకు రూ.329.82కోట్లు వ్యవసాయం, తాగునీ రు, ఉపాధి హామీ అన్నింటికీ కలిపి నిధులు అవసర మవుతాయని ప్రతిపాదించారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి మొత్తం కలిపి 63.29 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇందులో కేంద్రం నుంచి ఏ మేరకు సహాయం అందుతుందన్నది చూడాల్సి ఉంది.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదుల సంఘం వైస్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ ఫైజుల్లా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల చివరి వరకూ కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ల్యాండ్ టైటిల్ చట్టము వల్ల సామాన్య రైతులు, భూ యజమానులు నష్టపోతారని ఈ చట్టం ద్వారా రెవిన్యూ అధికారులకు సర్వ అధికారాలు కల్పించడం మంచిది కాదన్నారు. శనివారం న్యాయస్థానం ఆవరణ ఉన్న కార్యాలయంలో న్యాయవాదులు సమావేశంలో అంశాలపై చర్చించారు ఏది ఏమైనప్పటికీ ల్యాండ్ టైటిల్ని చట్టంను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్ఎస్ఎ సిబ్బంది పెన్‌డౌన్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

తమ న్యాయమైన హక్కుల సాధన కోసం రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు శనివారం మండల ఎస్-ఎస్ఎ(సమగ్ర శిక్ష అభియాన్)లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ ఉద్యోగుల తరహా సౌకర్యాలు, తదితర సమస్యల సాధన కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రెగ్యులరైజేషన్, వేతనాల పెంపు, తక్షణమే బకాయి వేతనాల చెల్లింపు, వెట్టిచాకిరిని ఖండిస్తూ నెల రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తక్షణమే తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, లేనిచో 20వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

నీటికుంటలో పడి మహిళ మృతి

లేపాక్షి : మండల పరిధిలోని వద్దోళ్లకుంటలో పడి రత్నమ్మ(49) మృతిచెందింది. తల్లి తిప్పమ్మ తెలిపిన వివరాల మేరకు.. రత్నమ్మకు పుట్టినప్పటి నుంచి మతి స్థిమితం సరిగా లేదు. వివాహం కూడా కాలేదు. శుక్రవారం ఇంటి నుండి బయటికి వెళ్లి తిరిగి రాకపోవండంతో చుట్టుపక్కల గాలించారు. శనివారం అటుగా వెళ్లిన గ్రామస్తులు వద్దోళ్లకుంట ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయం తెలిసి తిప్పమ్మ అక్కడికి వెళ్లి పరిశీలించగా రత్నమ్మ ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెంది ఉండవచ్చని తెలిపింది. విషయం తెలుసుకొన్న సిఐ వేణుగోపాల్, ఎస్ఐ గోపి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రి కి తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి

O.S.NO:484/2017

Between:

ఆవులపల్లి వీరభద్రప్ప S/o తాతమ్మ నాయుడు, R/at చిన్నాపల్లి, H/o కొక్కంటి క్రాస్, తనకల్ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...Plaintiff

మరియు

జల వెంకటరమణ S/o గంగులప్ప, R/at చిన్నాపల్లి, H/o కొక్కంటి క్రాస్, తనకల్ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...Defendant

పై దావాలోని పతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది, తనకి రావలసిన ప్రాంసరీ బాకీ వసూలు నిమిత్తము ప్రతివాది అయిన మీ పైన పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 21/12/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 21/12/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిద 21/12/2023

జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్ వాదితరుపు వకీలు, కదిరి

బహిరంగ ప్రకటన తేది:16/12/2023

కార్యనిర్వాహణ అధికారి వారి కార్యాలయము శ్రీ నసన్న కోట ముత్యాలమ్మ దేవస్థానము, ముత్యాలమ్మ పల్లి, నసన్న కోట (పోస్టు) రామగిరి మండలం శ్రీ సత్యసాయి జిల్లా

1.దేవస్థానము రూములుకు రంగులు కొనుట మరియు పూయించుటకు.
2.కరెంటు వైరింగ్, ప్లమ్మింగ్
3.బిల్డింగ్ ఫ్లోరింగ్, నల్ల బండలు, పేయింటింగ్ మొదలగునవి

గమనిక:-సదరు కొటేషన్లను 3 రోజుల లోపల కార్యనిర్వాహణ అధికారి కార్యాలయం నందు అందజేయవలెనని కోరడమైనది.

సం/- బి.ఆర్.వెంకటేశులు, కార్యనిర్వాహణాధికారి

వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం పెంపు : డిఇఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని డిఇఒ మీనాక్షి దేవి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి వివరాలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో మండలంలోని 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనడడ సంతోషించదగ్గ విషయమన్నారు. 3 ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్ర మంలో ఎంఇఒలు రాజేశ్వరీదేవి, గోపాల్‌నాయక్, జడ్పి హైస్కూల్ హెచ్‌ఎం.సుమన, ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎంపిడిఒ మునిస్వామి, ఎంఇఒ రాఘవయ్య ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో స్థానిక జడ్పి హైస్కూల్, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు నమూనాలు ప్రదర్శించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తర్వాత స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, ప్రిన్సిపల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ వీణ, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో వైజ్ఞానిక ప్రదర్శను తిలకిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నల్లచెరువు : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండల పరిధి లోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు వారి వారి నమూనాలను ప్రదర్శించారు. మండల స్థాయి ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగానికి సంబంధించి ఎపి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రూపొందిం చిన బ్లైండ్ స్టిక్, అదే పాఠశాల విద్యార్థి రశీద్ రూపొందించిన స్మార్ట్ స్ట్రీట్ లైట్ ఉత్తమ ప్రదర్శనకు ఎంపికయ్యాయి. బృంద విభాగంలో నల్లచెరువు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నీరు, నీటి పొల్యూషన్ జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. కార్యక్రమంలో ఎంఇఒలు తిరుపాల్‌నాయక్, చెన్నకేశవకుమార్, ఉపాధ్యాయులు, అశోక్‌కుమార్, లక్ష్మీరాణి, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర : మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఇఒలు శ్రీనివాసభాస్కర్, నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని మాతా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 150 మంది విద్యార్థులు, 45 మంది ఉపాధ్యాయులు నమూనాలను ప్రదర్శించగా ఐదుగురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, సామర్థ్యాలను పరీక్షించడానికి సైన్స్ ఫేర్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంఇఒ-2 ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫేర్‌లో ముఖ్యఅతిథిగా ఇఒఆర్డి అశోక్ కుమార్ రెడ్డి, న్యాయ నిర్ణేతగా వెంగళమ్మ చెరువు పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, నిడిమామిడి హెచ్‌ఎం పద్మజ పాల్గొన్నారు. 7 ఉన్నత పాఠశాలలతో పాటు కెజిబివి బాలికలు నమూనాలు ప్రదర్శించగా అధికారులు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. సైన్స్ ఈవెంట్‌లో బీడుపల్లి, ఫిజిక్స్‌లో పుట్టపర్తి, గణితంలో వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాలల విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

క్రీడలతోనే ప్రపంచ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధన్యత అందులో క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని రూరల్ అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం నాడు హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి విద్యాలయంలో స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సిఐ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎదో ఒక క్రీడను ఎంచుకుని అందులో బాగా రాణించాలన్నారు. విద్యను నిర్లక్ష్యం చేయకుండా క్రీడలకు సమప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం వాలీబాల్ ఆటను ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఆర్ జి విద్యాలయం సెక్రటరీ బాలసుందరం, హెచ్‌ఎం ప్రసాద్, ఎఒ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

డిసిసి ఉపాధ్యక్షుడిగా మహబూబ్‌బాషా

ఓబుళదేవరచెరువు : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడి ఓడిసికి చెందిన తుమ్మల మహబూబ్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉత్తర్యులు పంపారు. మహబూబ్‌బాషా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి, జిల్లా అధ్యక్షులు సుధాకర్, జంగా గౌతం, బాలాజీ మనోహర్‌తో పాటు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులం హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ

బత్తలపల్లి : స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల నూతన హెచ్‌ఎంగా దేవరకొండ మాధవి నియమితులయ్యారు. ఆమె శనివారం పాఠశాలకు వచ్చి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సత్యనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి పాటుపడతానన్నారు. పాఠశాల సిబ్బంది పరిచయం చేసుకుని ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎస్‌ఎస్‌సి మోడల్ పేపర్లు విడుదల

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారుచేసిన ఎస్-ఎస్‌సి మోడల్ పేపర్లను శనివారం సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్లు విద్యా ర్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ 25 ఏళ్ల అనుభవం కలిగిన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల చేత ఈ మోడల్ పత్రాలను తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు, నాయకులు, శివకుమార్, నరేష్, గోపి, శ్రీనివాసులు, రమేష్, కష్ణ, బాబయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం పార్థసారథి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు మండల పరిధిలోని కరావులపల్లి, కరావువులపల్లితండాలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వైసిపి సీనియర్ నాయకులు గంపల రమణారెడ్డి నివాసానికి వెళ్లారు. రమణారెడ్డితో పాటు చింతా గోపాల్‌రెడ్డిని టిడిపిలోకి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి, నాయకులు దేవా నరసింహులు, బీరే వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, జయరామ్, రవినాయక్, శ్రీనివాసులు, గంగిరెడ్డి, నీలకంఠారెడ్డి, నరేష్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న బికె.పార్థసారథి

అమరాపురం : మండల పరిధిలోని పులికుంట గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్ ఆధ్వ ర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజక వర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, మల్లికార్జున, డాక్టర్ కృష్ణమూర్తి హాజరయ్యారు. వారు ఇంటింటి కీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, శివరుద్రప్ప, నరసింహమూర్తి, కృష్ణమూర్తి, రామిరెడ్డి, చిట్టినడుకు మహలింగప్ప, మంజునాథ్, తిప్పేస్వామి, రఘుయాదవ్, అగ్రహారం నవీన్, హనుమంతరాయ, దుర్గేష్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, రవికుమార్, కృష్ణమూర్తి, శివకుమార్, దాదు, షబ్బీర్, రామచంద్రప్ప పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

కొత్తచెరువు : వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శ్రీ చైతన్య పాఠశాలల ఉమ్మడి అనంతపురం జిల్లాల ఎజిఎం సుబ్బారెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై శనివారం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ స్థానిక జూనియర్ కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. వారు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ప్రిన్సిపల్ నవీన్‌కుమార్‌రెడ్డి, డీన్ హనుమంతు, ఎఒ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

ధర్మవరం టౌన్ : ధర్మవరం డిపోలో ఖాళీగా ఉన్న దుకాణాల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకూ డిపో మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారాలు విక్రయిస్తామని, భర్తీ చేసిన వాటిని పుట్టపర్తి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో 28వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు 3 గంటలకు టెండర్ బాక్స్ తెరుస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న డా॥బత్తల హరిప్రసాద్

మృతుని కుటుంబానికి 'బత్తల' ఆర్థికసాయం

కదిరి టౌన్ : పట్టణంలోని హరిజనవాడకు చెందిన కుళ్లాయప్పస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆయన కుటుంబానికి శనివారం రూ. 10వేలు అందజేశారు. ఆయనతోపాటు కొమ్ము భాస్కర్, కిరణ్, ముబారక్, సునీల్, రవి ఉన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్ పరీక్షలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని బేరుపల్లి వద్ద ఉన్నా జైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జైన్ స్కూల్ హెచ్‌ఎం జయగుప్తా హాజరై మాట్లాడుతూ కరాటే వల్ల విద్యార్థుల్లో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మధైర్యం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయన్నారు. కలర్ బెల్ట్స్‌లోఉత్తీర్ణులై 79 మంది విద్యార్థులకు జయగుప్తా బెల్ట్, ప్రశంసాపత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర, జాఫర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలం పిల్లిగుండ్లు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రఘునందన్, నీలవేణి బదిలీపై వెళ్లడంతో శనివారం హెచ్‌ఎం సుధాకర్ అధ్యక్షతన ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఇఒలు శ్రీధర్, మోహన్, ఉపాధ్యాయులు వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ శైలజ, ఉపాధ్యాయులు మహేష్, నేత్రావతి, అలుపు నపల్లి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, రామప్ప, హరిప్రసాద్, ఆంజనేయులు, రంగనాథ్, మారుతి, వినోద్, శ్రీకాంత్‌రెడ్డి, గీతా, ఉషారాణి, పద్మశ్రీ, మంజుల, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రొద్దంలో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రం అవుతోంది. పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో రొద్దం చావిడి నుంచి బ్యాంకు వద్ద వరకు దాదాపు 100 మీటర్లు వరకు రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు.చిన్న రోడ్డు కావడంతో రోడ్డుకు ఇరువైపు వాహనాలు నిలుపుతుండడం మరింత సమస్యను తెచ్చిపెడుతోంది. ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో ఈ దారి వెంట రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రొద్దంలో ట్రాఫిక్ పరిస్థితి ఇలా...